క్లుప్తంగా

ఎన్‌సీసీ విద్యార్థులకు సామర్థ్య పరీక్ష


సామర్థ్య పరీక్షల అనంతరం లెఫ్టినెంట్స్‌తో ఎన్‌సీసీ విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్‌కు సంబంధించి శనివారం జరిగిన ప్రాక్టికల్స్‌కు 47 మంది హాజరయ్యారు. ఈ సామర్థ్య పరీక్షలు లెఫ్టినెంట్‌లు అనిల్‌కుమార్, జీశ్వర్‌సింగ్, గంగాధర్‌ల ఆధ్వర్యంలో జరిగాయి. హెచ్‌ఎం గోపాలకృష్ణ, ఎన్‌వోసీహెచ్ శివకృష్ణ పాల్గొన్నారు.

కిటుముల పంచాయతీలో వీధి దీపాల పంపిణీ


వీధి దీపాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమణమ్మ

చింతపల్లి: మండలంలోని కిటుముల పంచాయతీలో పలు గ్రామాలకు వీధి దీపాలను సర్పంచ్ రమణమ్మ అందజేశారు. శనివారం పంచాయతీ పరిధిలో కిటుములు, రాకోట, జాజులపాలెం, పలద, పకాబు, షీకాయబంద, తదతర గ్రామాల్లో వీధి దీపాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో కాలువల నిర్మాణం, సిమెంటు రోడ్లు, వీధి దీపాల సమస్య లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సుర్ల అప్పారావు, గెమ్మిలి వరహాలు నాయుడు, వనుము పాపిడి రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ


గుమ్మళ్లగొందిలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న డిప్యూటీ తహసీల్దారు దుమంతి సత్యనారాయణ

గూడెం కొత్తవీధి: మండలంలోని గుమ్మళ్లగొంది గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గూడెం కొత్తవీధి మండల భూసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దారు దుమంతి సత్యనారాయణ శనివారం నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర అభ్యసన సామగ్రిని పంపిణీ చేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా గిరిజన విద్యార్థులకు వీటిని అందజేసినట్టు డీటీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్నాజీ, కూర్మారావు, భద్రం, దారప్రసాద్ శివమూర్తి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం


విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న వైద్యాధికారి భావన

గంగవరం: విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన అవసరమని గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఒ.భావన అన్నారు. మండలంలోని చీడిపాలెం ఎంపీపీ పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని చెప్పారు. చేతులు తరచూ శుభ్రం చేసుకోవాలన్నారరు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సహకార బ్యాంక్ సేవలపై కళాజాతా


సహకార బ్యాంక్ సేవలపై కళాజాతా ప్రదర్శిస్తున్న కళాకారులు

అడ్డతీగల: సహకార బ్యాంక్ సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని అడ్డతీగల సొసైటీ సీఈవో ఎ.మణిరాజు కోరారు. ఈ మేరకు గ్రామాల్లో బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం కళాకారులు కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. సహకార జ్యోతి పథకం కింద సీనియర్ సిటిజన్‌లకు డిపాజిట్లపై అధిక వడ్డీ రేట్లు ఉన్నాయన్నారు. బంగారు నగలపై తక్కువ వడ్డీతో మిగతా బ్యాంక్‌ల కన్నా ఎక్కువ మొత్తం రుణం మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. రైతులకు వ్యవసాయ ప్రోత్సాహక రుణ సదుపాయం ఉందన్నారు. ఇళ్ల నిర్మాణానికి రుణ అవకాశాలు ఉన్న విధానాన్ని వివరించారు.

చెంతనే నీరు.. అందని తీరు.!


- దుమ్ముకొండ, కన్నేరు వాగులపై ప్రాజెక్టుల నిర్మాణం కలేనా?
- వృథాగా పోతున్న నీరు
- 4 మండలాల ప్రజలకు తప్పని అవస్థలు

వై.రామవరం: కళ్ల ముందు పుష్కలంగా నీరు కనిపిస్తున్నా వినియోగించుకోలేని పరిస్థితి ఆ గిరిజనులది. వాగుల్లో గలగల పారుతూ వృథాగా నీరు పోతున్నా ఏం చేయలేని నిస్సాహాయత వారిది. ప్రాజెక్టుల నిర్మాణం కోసం దశాబ్దాలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలంలో ఎత్తయిన కొండల్లో దుమ్ముకొండ ఒకటి. మండల కేంద్రానికి సుమారు 3 కిలోమీటర్ల దూరం నుంచి వ్యాపించి ఉంది. ఆ కొండపైన కాలాతీతంగా ఏడాది పొడవునా జీవ నదిలా పారే జలధార ఉంది. ఆ ధార ఆ కొండ పైనుంచి చూస్తే లోయలా కనిపించే వై.రామవరం మండలం మీదుగా ప్రవహిస్తోంది. అయితే మండల ప్రజలకు ఆ నీరు అందకుండా వృథాగా పోతోంది. మండల కేంద్రానికి దగ్గరలోని గన్నవరం గ్రామం మీదుగా దుమ్ముకొండ వాగు, కోట గ్రామ సమీపంలో మరో కన్నేరు వాగు నిత్యం నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. మండలంలో ఈ రెండు వాగులు మండు వేసవిలో సైతం జీవనదుల్లా ప్రవహిస్తున్నప్పటికీ ఆ జలాలు మండల ప్రజలకు కించెత్తు కూడా ఉపయోగపడడం లేదు. ప్రస్తుతం వై.రామవరం మండలంలోని భూములన్నీ సాగు నీరు లేక, వర్షాధారంతో ఏడాదికి ఒకే పంట పండుతుంది. అదీ కూడా వరుణుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిస్తేనే.

ప్రాజెక్టులు నిర్మిస్తే 20 వేల ఎకరాలకు సాగునీరు

ఆ రెండు వాగులపై ప్రాజెక్టులు నిర్మిస్తే వై.రామవరం మండలంతో పాటు సరిహద్దు మండలాలైన అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం, మారేడిమిల్లి మండలాలకు చెందిన సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. రెండు పంటలు పండి ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణం ప్రజలకు దశాబ్దాలుగా తీరని కలగా మిగిలింది. మరోవైపు ప్రాజెక్టుల నిర్మాణంతో ఆయా గ్రామాలు ముంపు సమస్య నుంచి బయట పడతాయి కూడా. నీరంతా అటవీ ప్రాంతంలోనే నిల్వ ఉంటుంది. దీంతో ప్రజలకు పెద్దగా పునరావాసం కల్పించే అవసరం కూడా లేదు. రెండు కొండల నడుమ ప్రవహించే ఈ వాగులపై నిర్మాణాలు చాలా తక్కువ వ్యయంతో పూర్తయ్యే అవకాశాలున్నాయి. అంతే కాకుండా ఈ ప్రాజెక్టుల వద్ద జల విద్యుత్ కేంద్రాలు కూడా నిర్మించవచ్చు. ఏజెన్సీ ప్రాంతాలకు విద్యుత్ కొరత తీరుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వై.రామవరం మండలం గన్నవరం గ్రామం వద్ద దుమ్ముకొండవాగుపైన, కోట పంచాయతీ సిరిమెట్ల గ్రామం వద్ద కన్నేరు వాగులపై ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


గన్నవరం సమీపంలో దుమ్ముకొండ వాగులో వృథాగా పోతున్న నీరు


కోట పంచాయతీ సమీప కన్నేరు వాగులో వృథాగా పోతున్న నీరు

ప్రాజెక్టులతో వేలాది ఎకరాలు సాగులోకి..



కన్నేరు, దుమ్ముకొండ వాగులపై ప్రాజెక్టులు నిర్మిస్తే వేలాది ఎకరాలు సాగులోకి వస్తాయి. వై.రామవరం, అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం, మారేడిమిల్లి మండలాలు ఎంతో అభివృద్ధి చెందుతాయి. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి విశేష కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారులు స్పందించి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి.
– కడబాల ఆనందరావు, ఎంపీపీ, వై.రామవరం మండలం

కలెక్టర్‌కు విన్నవించాం..



ఈ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఇప్పటికే జిల్లా కలెక్టరుకు విన్నవించాం. దీనిపై సర్వే నిర్వహించాల్సి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే నిధులు మంజూరు చేయించాలి.
– వీరమళ్ళ సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ, వై.రామవరం

చింతపల్లి ఏపీడీగా లాలం సీతయ్య



చింతపల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం చింతపల్లి క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా లాలం సీతయ్య నియమితులయ్యారు. గత కొంత కాలంగా క్లస్టర్ ఏపీడీ పోస్టు ఖాళీగా ఉండడంతో స్థానిక స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ఏఈఈ లోకేష్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల తమ శాఖలో పని భారం అధికమైందని, అదనపు బాధ్యతల నుంచి తనను తప్పించాలని డ్వామా పీడీకి ఆయన లేఖ రాసి, విధుల నుంచి తప్పుకున్నారు. దీంతో అనంతగిరి ఈవోపీఆర్‌డీగా పని చేస్తున్న లాలం సీతయ్యకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం చింతపల్లిలో బాధ్యతలు స్వీకరించనున్నారని తెలిసింది.

గొంది కోడాపుట్టులో 4న వైద్య శిబిరం

పెదబయలు: అడుగులపుట్టు పంచాయతీ గొంది కోడాపుట్టు గ్రామంలో విశాఖ గాయత్రి ఆస్పత్రి సహకారంతో ఈ నెల 4న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు అడుగులపుట్టు మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోయిభ కృష్ణారావు తెలిపారు. భగవాన్ సత్యసాయి బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేస్తామన్నారు. శిబిరానికి వచ్చే రోగులు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష


అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న ఇంటర్ విద్యార్థులు


రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న ఇంటర్ విద్యార్థులు

అడ్డతీగల: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షకు 150 మంది విద్యార్థులు హాజరైనట్లు అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నున్నం రాజేంద్రస్వామి తెలిపారు. నైతికత, మానవీయ విలువలు, వంటి అంశాల్లో విద్యార్థులకు అవగాహన కోసం ఇంటర్ బోర్డు అధికారులు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక బాలకల గురుకుల జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 290 మంది హాజరయ్యారు. ఎథిక్స్ అండ్ మోరల్ వాల్యూస్ అనే అంశంపై ఈ పరీక్ష జరిగింది. గురుకుల కళాశాల నుంచి 132 మంది(ఇంగ్లిష్ మీడియంలో), ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 158 మంది (తెలుగు, ఇంగ్లిష్ మీడియం) ఈ పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాళ్లు శిరీష, సుబ్రహ్మణ్యం తెలిపారు.

వారపు సంత వెలవెల


వారపు సంతలో కొనుగోలుదారుల కోసం వేచి చూస్తున్న కూరగాయల వ్యాపారులు

ముంచంగిపుట్టు: ప్రతి వారం కొనుగోలుదారులతో కళకళలాడే ముంచంగిపుట్టు వారపు సంత శనివారం వెలవెలబోయింది. కొనుగోలుదారులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఏమాత్రం వ్యాపారాలు సాగలేదు. కూరగాయల రైతులు నష్టాలను చవిచూశారు. దొడిపుట్టు, నర్సిపుట్టు, వనభసింగి, పేటమాలిపుట్టు, పనస, సిందిపుట్టు గ్రామాల నుంచి అధికంగా కూరగాయలను గిరిజన రైతులు తీసుకొచ్చారు. సాయంత్రం వరకు వేచి చూసినా కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగాయి. చేసేది లేక తక్కువ ధరకే కూరగాయలు అమ్మాల్సి వచ్చిందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా చార్జీలు సైతం రాలేదని వాపోయారు. కిరాణా, వస్త్ర, హోటల్, తదితర వ్యాపారుల పరిస్థితి సైతం ఇదే విధంగా ఉంది.

సైబర్ నేరాలపై అవగాహన


సుజనకోటలో సైబర్ నేరాలపై కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

ముంచంగిపుట్టు: సుజనకోట, కించాయిపుట్టు పంచాయతీల్లోని పలు గ్రామాల్లో శనివారం నాబార్డ్ సహకారంతో స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ కళాజాత బృందం సభ్యులు మెజీషియన్, మ్యూజిక్ షో, వీధి నాటిక, జానపద గీతాలతో అవగాహన కల్పించారు. ఎస్‌బీఐలో ఉన్న ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి పథకం, ముద్ర రుణాలు, జనరల్ ఇన్సూరెన్స్‌ల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు ఎవరికి చెప్పకూడదని, సైబర్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు, డ్వాక్రా మహిళలు, గిరిజనులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శన


కుసుర్లపూడి హైస్కూల్లో ప్రదర్శనను తిలకిస్తున్న పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు


ప్రదర్శనలో ఉంచిన ఏటికొప్పాక బొమ్మలు

రోలుగుంట : కుసర్లపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శనను శనివారం ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అప్పాన రాంబాబు స్ఫూర్తితో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో జాతీయ భావం, పనిపట్ల గౌరవం, ఈ ప్రదర్శన వల్ల ఏర్పడుతుందని పాఠశాల హెచ్‌ఎం శెట్టి మోహనరావు అన్నారు. ఏటికొప్పాక బొమ్మలు తయారు చేసిన శకటానికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీ నుంచి మూడో స్థానం సంపాందించారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.పద్మావతి పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో చింతపల్లి పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయిలో థింసా నృత్యంలో ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులు

చింతపల్లి: రాష్ట్ర స్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన క్రీడా పోటీల్లో చింతపల్లి సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి రాష్ట్ర స్థాయి బహుమతులు అందుకున్నారని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. నంద్యాల జిల్లా మహానంది వ్యవసాయ కళాశాల ఆవరణలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో పాలిటెక్నిక్ విద్యార్థులకు జనవరి 29, 30, 31 తేదీలలో క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చింతపల్లి పాలిటెక్నిక్ కళాశాల నుంచి పాల్గొన్న విద్యార్థిని వంతల అమృత సోలో సింగింగ్‌లో ప్రథమ, గ్రూప్ డ్యాన్స్ విభాగంలో కళాశాలకు చెందిన విద్యార్థులు థింసా నృత్యంలో ద్వితీయ బహుమతులు సాధించారని ఏడీఆర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు విస్తృత పర్యటన

- బ్రహ్మరథం పట్టిన ఐనాడ పంచాయతీ గిరిజనులు
- గాతపనుకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


గాతపనుకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు/పాడేరు రూరల్: పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సుమారు మూడు కిలోమీటర్ల మేర కాలినడకన పలు గిరిజన గ్రామాల్లో శనివారం విస్తృతంగా పర్యటించారు. కొండలు, గుట్టలు ఎక్కి ఆయా గ్రామాలకు చేరుకుని సమస్యలు తెలుసుకోవడంతో గిరిజనులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. తొలిసారి ఎమ్మెల్యే తమ గ్రామానికి రావడంతో వారి సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. పాడేరు మండలం చిట్టశివారు ఐనాడ పంచాయతీ రెల్లిబంద, సీకాయిపాడు, గుర్రలమామిడి, గాతపనుకు, రాయిపాలెం, రాయిపాలెం, రెల్లిబంద, గదుపూరు, కుసర్లపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పర్యటించారు. ఎమ్మెల్యేగా గెలిచి తొలిసారిగా వచ్చిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, హారతిలిస్తూ బ్రహ్మరథం పట్టారు. రాయిపాలెం నుంచి గాతపనుకు గ్రామానికి వెళ్లే ఐదు కిలోమీటర్ల మేర జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న కూటమి ప్రభుత్వం

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. అభివృద్ధికి నోచుకోని మారుమూల గ్రామాల రూపురేఖలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అంటూ హామీలు ఇచ్చి ఒక్కటీ కూడా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎద్దులగుమ్మి జలపాతాన్ని అభివృద్ధి చేయాలి

గుల్లి గ్రామ సమీపంలో ఉన్న ఎద్దులగుమ్మి జలపాతాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఐటీడీఏ నిధులతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని జిల్లా అధికారులను ఆయన కోరారు. ఇలావుండగా గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. వీటిపై సానుకులంగా స్పందించిన ఆయన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జీలుగుబోయిన బిమలమ్మ, స్థానిక ఎంపీటీసీ తూపురు ఎర్రయమ్మ, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఎస్టీ సెల్ నియోజక వర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు దూసురు గంగరాజు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు పాల్గొన్నారు.


కాలినడకన కొండ శికర గ్రామాలకు వెళ్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు శ్రేయస్కరం

కొయ్యూరు: గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేసుకోవడం శ్రేయస్కరమని యూ చీడిపాలెం వైద్యుడు జయ ప్రకాశ్ అన్నారు. ఆయన శనివారం మారుమూల గ్రామాలైన మర్రిపాకలు, యర్రగొండలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 100 మందికిపైగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరికి అనారోగ్యం సోకినా వెంటనే ఆస్పత్రికి రావాలని కోరారు. నాటు మందులు వాడరాదన్నారు. గర్భిణులు విధిగా ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రసవానికి ముందుగానే ఆస్పత్రిలో చేరాలని కోరారు. దీని వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

రంపచోడవరం: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సెమినార్, క్విజ్ పోటీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, రవాణా, విద్యా సంబంధించిన విషయాలపై సెమినార్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.వసుధ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై ప్రయాణించినప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. క్విజ పోటీల విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు.

వెన్నెలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం నేడు


వెన్నెలమ్మ తల్లి ఉత్సవ విగ్రహం


విద్యుత్ దీపాల వెలుగులో వెన్నెలమ్మ తల్లి ఆలయం

జి.మాడుగుల: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత వెన్నెలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పాడేరు-జి.మాడుగుల జాతీయ రహదారిలో బందవీధి-మత్స్యపురం గ్రామ మధ్య ఘాటీలో కొలువైన అమ్మవారి దర్శనానికి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. అమ్మవారికి సారె, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి


నక్కబంద గ్రామంలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి అచ్యుత్

గూడెం కొత్తవీధి: చలికాలంలో చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని గూడెం కొత్తవీధి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అచ్యుత్ అన్నారు. మండలంలోని దేవరాపల్లి సచివాలయం పరిధిలోని నక్కబంద గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నాటు, పసర మందులను వాడటం మంచిది కాదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎం బాలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ లింగేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

4న మసమ్మ అమ్మవారి తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం నుంచి దబ్బకుంటు రహదారిలో గల శ్రీ మసమ్మ తల్లి తీర్థం ఈ నెల 4వ తేదీ రథ సప్తమి రోజున ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు, గుర్రాల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎడ్ల పోటీల్లో ప్రథమ బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు, నాలుగో బహుమతి రూ.3వేలు, ఐదో బహుమతి రూ.2వేలు విజేతలకు అందజేస్తామన్నారు. గుర్రాల పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో, ఐదు బహుమతులుగా వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు చొప్పున విజేతలకుఅందజేస్తామన్నారు. అలాగే దాతల సహకారంతో ఆలయం వద్ద అన్నసమారాధన, 101 ఘాటాలతో ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.